www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024
5
పశ్చిమ గోదావరి



నేడు డయల్ యువర్ ఎస్‌పి



ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ నెల 23వ తేదీన డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌పి వేజెండ్ల అజిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెల్ నెంబర్ం 9000110289కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలు తెలియజేయాలని ఎస్‌పి సూచించారు.

పోస్టుల్లేవు.. సమయమూ లేదు..!

ఉమ్మడి జిల్లాలోని డిఎస్‌సి అభ్యర్థుల వేదన వర్ణనాతీతం. జిల్లాలో పరీక్ష రాసే ఉపాధ్యాయ అభ్యర్థులు వేల సంఖ్యలో ఉండగా, నోటిఫికేషన్‌లో పోస్టులు అతి తక్కువగా ఉండటంతో ఏం చేయాలో తెలినీ పరిస్థితి ఒకవైపు, చదువుకునేందుకు సమయం లేకపోవడం మరోవైపు డిఎస్‌సి అభ్యర్థులను కుంగదీస్తోంది. నెలరోజుల వ్యవధిలోనే టెట్, డిఎస్‌సి పరీక్షల నిర్వహణపై మానసికంగా తల్లడిల్లుతున్నారు. పరీక్ష ఫీజు భారీగా పెంచడం అభ్యర్థులను ఆర్థికంగా ఇబ్బంది పెడుతోంది. దీంతో డిఎస్‌సి రాయాలా, వద్దా అనే మీమాంసలో అంతా సతమతమవుతున్నారు.

- డిఎస్‌సి అభ్యర్థుల బాధలు వర్ణనాతీతం
- అన్నీ కలిపి ఉమ్మడి జిల్లాలో 300 పోస్టులకు నోటిఫికేషన్
- జిల్లాలో 20 వేల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు
- నెల రోజుల వ్యవధిలోనే టెట్, డిఎస్‌సి రాయాల్సిన దుస్థితి
- సన్నద్ధతకు సమయం లేకపోవడంపై అభ్యర్థుల్లో ఆందోళన
- పరీక్ష ఫీజు పెంపు, నిర్వహణ తీరుపై డిఎస్‌సి అభ్యర్థుల ఆవేదన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల మౌనంగా ఉండి, ఎన్నికల ముందు ప్రకటించిన డిఎస్‌సి నోటిఫికేషన్ అభ్యర్థులను తీవ్ర వేదనకు గురిచేస్తోంది. నూతన విద్యావిధానం పేరుతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి పోస్టులను తక్కువ చేసి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఫిబ్రవరి 8న టెట్, 12న డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వం జారీచేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్‌జిటి పోస్టులు 102, స్కూల్ అసిస్టెంట్ 145, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టిజిటి) పోస్టులు 59 మొత్తం 306 పోస్టులకు మాత్రమే పేర్కొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 వేలకుపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది. పోస్టులు తక్కువగా ఉండటంతో కష్టపడి చదివినా ఉద్యోగం వస్తుందో, లేదోనని ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రకటించిన డిఎస్‌సి, టెట్ నిర్వహణా తేదీలు అభ్యర్థులను తీవ్ర గందరగోళంలోకి నెట్టేశాయి. టెట్ పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి మార్చి తొమ్మిదో తేదీ వరకూ జరగనుండగా, డిఎస్‌సి పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జరగనున్నాయి. టెట్ పరీక్ష పాసైన వారికే డిఎస్‌సి రాసే అర్హత ఉంటుంది. అయితే ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌లో డిఎస్‌సి దరఖాస్తు తేదీలు ఫిబ్రవరి 12 నుంచి 25వ తేదీ వరకూ అని పేర్కొంది. అంటే టెట్ పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి జరగనుండగా అంతకు ముందుగానే డిఎస్‌సి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. టెట్ పరీక్ష పాస్ అయ్యారో, లేదో తెలియకుండానే డిఎస్‌సికి కూడా దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. డిఎస్‌సిలో ఒక్కో పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు రూ.750గా ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఎ, బిఇడి చదివిన నిరుద్యోగులు ప్రస్తుత నోటిఫికేషన్ ప్రకారం ఎస్‌ఎ లాంగ్వేజ్, ఎస్‌ఎ నాన్ లాంగ్వేజ్, పిజిటి, టిజిటి పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ నాలుగు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే రూ.750 చొప్పున రూ.మూడు వేలు వరకూ ఖర్చవుతోంది. టెట్ రెండు పేపర్లకు మరో రూ.1500 మొత్తం కలిపి రూ4,500 పరీక్ష ఫీజుగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీరా ఫీజు చెల్లించాక టెట్ పాస్ కాకపోతే ఈ ఫీజు అంతా గంగలో పోసినట్లే అవుతుందని అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. టెట్ ఫలితాలు వచ్చే వరకూ డిఎస్‌సి దరఖాస్తు గడువును పొడిగించాలని అభ్యర్థులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

నెల రోజుల వ్యవధిలో ప్రిపరేషన్ ఎలా?

వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రతియేటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని, మెగా డిఎస్‌సి ప్రకటించి పోస్టులు భర్తీ చేస్తామని గత ఎన్నికల్లో ప్రకటించారు. దీంతో ఎంతోమంది ఉపాధ్యాయ అభ్యర్థులు అవనిగడ్డతోపాటు పలుప్రాంతాలకు వెళ్లి పెద్దఎత్తున సొమ్ము వెచ్చించి రెండేళ్లపాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ కష్టపడ్డారు. ప్రభుత్వం నూతన విద్యావిధానం తెరపైకి తెచ్చి ఉపాధ్యాయ పోస్టులను కుదించేసింది. దీంతో ఇక ఉపాధ్యాయ ఉద్యోగాలు రావని నిరుద్యోగులంతా ఏదోక పని చేసుకుంటున్నారు. నాలుగున్నరేళ్ల నిద్రపోయిన ప్రభుత్వం హఠాత్తుగా ఎన్నికల ముందు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. అదీ అతి తక్కువ పోస్టులతో మాత్రమే. చదువుకునేందుకు సమయం కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. రెండేళ్లుగా ఉపాధ్యాయ అభ్యర్థులంతా పుస్తకాలు పక్కన పడేసి బతుకుదెరువుకోసం పాట్లు పడుతున్నారు. ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ రావడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. చదువుకునేందుకు సమయం లేకపోవడంతో ఏవిధంగా పరీక్షలు రాయాలో దిక్కుతోచడం లేదు. దరఖాస్తు చేస్తున్నప్పటికీ ఏఒక్క అభ్యర్థీ సంతృప్తిగా లేకుండాపోయిన పరిస్థితి ఉంది. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. డిఎస్‌సి అభ్యర్థుల బాధను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను, ప్రాంతాలను గుర్తించి వెంటనే నివేదికను అందజేయాలని సెక్టార్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్ సంయుక్తంగా జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సెక్టార్ అధికారులతో వర్నలబిలిటీ, క్రిటికల్ పోలీస్ స్టేషన్లు, ప్రాంతాల గుర్తింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నివిధాలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను, పోలింగ్ స్టేషన్లను కచ్చితంగా గుర్తించాలని తహశీల్దార్లు, సెక్టార్ అధికారులను ఆదేశించారు. సంబంధిత నివేదికను ఈ నెల 28లోపుగా అందజేయాలన్నారు. జిల్లాలో మొత్తం 1,461 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో వర్నలబిలిటీ పరిధిలోకి 184 కేంద్రాలు, క్రిటికల్ పరిధిలోకి 215 పోలింగ్ స్టేషన్లను ప్రాథమికంగా గుర్తించామన్నారు. మరోసారి జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ నివేదికలను అందజేయాలని ఆదేశించారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు మాట్లాడుతూ వర్నలబిలిటీ, క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల మధ్య వ్యత్యాసాన్ని విపులంగా వివరించారు. గత ఎన్నికల్లో మూడు ప్రత్యేక ఫోర్స్‌లను వినియోగించామని, ఇప్పటి నివేదికల ప్రకారం అదనంగా ఫోర్స్‌లను కోరామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, ఎన్నికల తహశీల్దారు సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, సిఐలు పివిజి.తిలక్, ఎన్.చలపతిరావు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ




ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి ఎస్‌ఎస్‌సి, ఇంటర్, డిఎస్‌పి, టెట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్ బోర్డు కమిషనర్ సౌరబ్‌గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌తో కలిసి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశామన్నారు. జిల్లాలో మార్చి 18 నుండి 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు 21,341 మంది రెగ్యులర్ విద్యార్థులు, 6,085 మంది ప్రయివేటు విద్యార్థులు కలిపి మొత్తం 27,426 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 35,949 మంది హాజరు కానుండగా వీరిలో ప్రథమ సంవత్సరం జనరల్ 16,017 మంది, ఒకేషనల్ 1,789 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ 16,362 మంది, 1,781 మంది ఒకేషనల్ ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఇంటర్‌కు సంబంధించి ఇప్పటికే ప్రాక్టికల్, థియరీ పరీక్షలు పూర్తయ్యాయని, మార్చి ఒకటి నుండి 20వ తేదీ వరకు రెగ్యులర్ పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎఎస్‌పి వి.భీమారావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, ఇంటర్ ఇన్‌స్పెక్షన్ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు, ఇన్‌ఛార్జి విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సత్యనారాయణ, డిఐఇఒ ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో జనసేనలో చేరతా

మాజీ మంత్రి కొత్తపల్లి



మాట్లాడుతున్న కొత్తపల్లి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

త్వరలో తన అనుచరులతో కలిసి జనసేనలో చేరతానని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రకటించారు. గురువారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన సోదరుడు, మాజీ ఎంఎల్‌ఎ కొత్తపల్లి జానకీరామ్‌తో కలిసి మాట్లాడారు. స్వప్రయోజనాలు ఆశించకుండా రాష్ట్ర, దేశ భవిష్యత్తు కోసం ఆలోచించే, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చడంతో జనసేనలో చేరతానని చెప్పారు. గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి యువతకు ఆరాధ్య నాయకుడన్నారు. కార్యక్రమంలో వన్నెంరెడ్డి శ్రీను, గుగ్గిలపు మురళి, యర్రంశెట్టి బాబులు, అడ్డాల శ్రీను, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: జనసేనలో చేరనున్నట్లు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మను గురువారం ఆయన దర్శించుకుని మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు గొప్పవి అన్నారు. రాజధాని, ప్రత్యేక హోదా, అమరావతి రైతులు, రైల్వేజోన్ కోసం పదేళ్లుగా పవన్ అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న పోరాటాలు నచ్చే జనసేన పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని సుబ్బారాయుడు తెలిపారు. ఆయన వెంట ముక్కు పుల్లయ్య, దొంగ స్వామి, మెండు రాజేష్ పలువురు అభిమానులు ఉన్నారు.

కాలనీల్లో సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం

సిపిఎం విమర్శ


నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరావాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి తవిటి నాయుడు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం కాలనీవాసులకు మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ఆరోపించారు. మండలంలోని అతిపెద్ద జగనన్న కాలనీ తాళ్లకోడు కాలనీ అని, 73 ఎకరాల్లో కాలనీవాసులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి తవిటినాయుడు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇక్కడ సుమారు ఇప్పటికే 400 కుటుంబాలు నివాసముంటున్నా కనీస సదుపాయాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 23వ తేదీ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని, దీనికి కాలనీవాసులంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఎం నేత డోకల లక్ష్మి మాట్లాడుతూ సిపిఎం పోరాట ఫలితంగా పట్టణంలో చెంచు కాలనీ, చంద్రబాబు నగర కాలనీలు ఏర్పడ్డాయన్నారు. మరో నాయకుడు పెంకి అప్పారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా 73 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రజలకు ఇళ్లస్థలాలుగా ఇచ్చినా సదుపాయాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు డి.రాంబాబు, బివి.వర్మ తదితరులు మాట్లాడారు. కాలనీవాసులైన శిఖనం రామారావు మాట్లాడుతూ తాగేందుకు నీరు లేదని, ఐదు రోడ్లకు కలిపి ఒక వైపు మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. అంగాని మంగతాయారు, ఎన్.మంగ మాట్లాడుతూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మురుగునీరు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేక నానావస్థలు పడుతున్నామన్నారు. కాలనీవాసుల కమిటీ కన్వీనర్ విజయవాడ వెంకటరమణ మాట్లాడుతూ ఇక్కడ సదుపాయాలు కల్పించకుండానే ఇక్కడ నివాసం ఉండకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని బెదిరించారని వాపోయారు. రోడ్లు లేవు, తాగునీరు లేదు, శ్మశానవాటిక లేదని తెలిపారు. దొంగతనాలు పెరిగిపోతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

పోలియో చుక్కలు వేయించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు వారందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులకు, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి మూడో తేదీన 0–5 సంవత్సరాల వయస్సు మధ్య గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. నరసాపురం పట్టణంలో 40 బూత్‌ల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మోడల్ ఆఫీసర్ వివిఎస్‌సిహెచ్.స్వరూప్, డాక్టర్లు కె.మోహన, పి.సోనియా, ఎస్.సత్యభూషణ్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్‌ను కోరిన పొన్నమండ బాలకృష్ణ



కలెక్టర్‌కు అంబేద్కర్ చిత్రటం అందజేస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ కోరారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని బాలకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతోపాటు అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ఎస్‌సి, ఎస్‌టి సమస్యలతో పాటు గొరగనమూడిలోని జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. గొరగనమూడిలో జగనన్న లేఔట్ ఏర్పాటు చేశారని, 294 మందికి పట్టాలు పంపిణీ చేసి నాలుగేళ్లు గడుస్తోందని తదెలిపారు. ఇప్పటికీ వరకూ 170 మందికి భూమిని స్వాధీనం చేయలేదని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పట్టాలు పొందిన ప్రతి ఒక్కరికీ త్వరలో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

చురుగ్గా రోడ్ల అభివృద్ధి పనులు

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో నరసాపురం నియోజకవర్గంలో పలు రహదారులు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం చిట్టవరం గ్రామంలో రూ.30 లక్షలతో జరుగుతున్న సిమ్మెంటు రహదారి పనులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో నాణ్యతాలోపంతో రోడ్లు నిర్మించడం వల్ల భారీ వర్షాలకు దెబ్బ తినడంతో వాటి పునరుద్ధులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి నియోజకవర్గం రహదారులన్నీ నిర్మిస్తామన్నారు. ఇప్పటికే కొన్ని రహదారులను పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. మరికొన్ని రహదారుల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నిర్మాణాల్లో ఎటువంటి లోపాలు లేకుండా న్యాణతతో చేస్తున్నట్లు తెలిపారు. రహదారులు త్వరలో పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సర్పంచి తాడి లక్ష్మణరావు, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, పిఎసిసి డైరెక్టర్ సత్యనారాయణ, కొల్లా శ్రీనివాస్, పంచాయితీరాజ్ ఎఇ వైవి.నాగేశ్వరరావు ఉన్నారు.



సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రసాదరాజు

పార్కు పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 29వ వార్డు కాటన్ పార్కులో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను గురువారం మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. పార్కు నిర్వహణ పనులపై పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించండి : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికల సమీపిస్తున్న వేళ నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాలను వెంటనే గుర్తించాలని పోలీసులను భీమవరం డిఎస్‌పి వి.నారాయణస్వామి రెడ్డి ఆదేశించారు. గురువారం ఉండి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్‌పి వి.నారాయణస్వామి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసులందరూ అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిఘా ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. బైండోవర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల్లో నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎక్కడా ఎటువంటి గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆకివీడు సిఐ కెవివిఎన్ సత్యనారాయణ, భీమవరం రూరల్ సిఐ వి.సత్యకిషోర్, ఉండి ఎస్‌ఐ మందపల్లి లక్ష్మణ్, ఆకివీడు ఎస్‌ఐ నాగబాబు, పాలకోడేరు ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఎక్కువ ప్రసవాలు జరిగేలా చూడాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు అధిక సంఖ్యలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా వైద్యులు అందుబాటులో ఉండాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ మహేశ్వరరావు ఆదేశించారు. పాలకోడేరు పిహెచ్‌సిని గురువారం డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో డెలివరీలు చేసే విధానం, సిబ్బంది అటెండెన్స్, ఆసుపత్రి రూములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న స్టాఫ్‌నర్స్ ఎస్సైను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఏడో రోజుకు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఆచంట

మార్టేరు వ్యవసాయ వరి పరిశోధనా కేంద్రంలో పనిచేసే కార్మికుల సమ్మె గురువారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ బడుషా సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కిరణ్‌కుమార్ నాగరాజు విజయలక్ష్మి, బి.నాగలక్ష్మి, సావిత్రి, గోవర్ధన, దుర్గ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంఎల్‌ఎ రంగనాథరాజు సేవలు అభినందనీయమని ఆచంట వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి అన్నారు. ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పెదపేటలో రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును సర్పంచి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వస్తే పెద్దపేట ఎంపీ పాఠశాల పక్కన రోడ్డులో అడుగు లోతు నీరు చేరడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడేవారని, విషయాన్ని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో త్వరితగతిన సీసీ రోడ్డు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కొండేటి సురేష్ బాబు, రాష్ట్ర కోఆపరేషన్ డైరెక్టర్ అండే నాగ బసవన్న, సొసైటీ చైర్మన్ వీర వీరభద్రం పాల్గొన్నారు.

పాలకోడేరు: విస్సాకోడేరులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను సర్పంచి బొల్లా శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. పెద్దపేట నుండి గాంధీపేట వరకూ సుమారు 155 మీటర్ల మేర రూ.7 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచి బొల్లా శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతిచ్చినట్లు తెలిపారు. సర్పంచి శ్రీనివాస్ వెంట 9వ వార్డు సభ్యులు నెహేమియా రాజు పేట సంఘస్తులు ఉన్నారు.

అన్నదాన భవనానికి రూ.50వేల విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ళకూరులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదాన భవన నిర్మాణానికి దాత గురువారం విరాళం అందజేశారు. కలవపూడి గ్రామానికి చెందిన యర్ర గొల్లబాబు దంపతులు రూ.50 వేలు స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్‌కు అందజేశారు.

ఉత్తమ దర్శకుడు కోడి రామకృష్ణ

పాలకొల్లు: శతాధిక చిత్రాల దర్శకుడు కోడి రామకృష్ణ వర్ధంతిని స్థానిక మారుతీ సినిమా హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. అరుంధతి వంటి గొప్ప చిత్రాలకు దర్శకత్వం వహించి పాలకొల్లు గొప్ప తనాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప దర్శకుడు కోడి రామకృష్ణ అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడికొండ శ్రీనివాసరావు, కోడి రామకృష్ణ చిన్ననాటి స్నేహితుడు పి.సూర్యనారాయణ, విటకుల వెంకటరామారావు, బోనం మునసబు, మెండెల్ పెద్ద, థియేటర్ మేనేజర్ దేవళ్ల బుజ్జి పాల్గొన్నారు.

హనుమంతుకు ఘన నివాళి

పాలకొల్లు: శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం ఆధ్వర్యంలో కన్నెగంటి హనుమంతు 102వ వర్ధంతిని గురువారం గాంధీ బొమ్మల సెంటర్లో ముచ్చర్ల శ్రీరామ్ అతిథి గృహ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నెగంటి చిత్రపటానికి వివిధ రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, వివిధ సామాజిక సేవా దారులు నివాళులర్పించారు. గాంధేయ మార్గంలో పయనించిన హనుమంతుని ఒంటరిని చేసి తుపాకీతో కాల్చి చంపేశారని తెలిపారు. గుంటూరు జిల్లాకు కన్నెగంటి హనుమంతు పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని ముక్త కంఠంతో విన్నవించారు. ఈ కార్యక్రమంలో వంగా నర్సింహారావు, బోనం వెంకట నరసయ్య, అడబాల వెంకట రమణ, ముచ్చర్ల సంజయ్, ముచ్చర్ల శ్రీరామ్, పెనుమాక రామ్మోహన్, రావూరి సుధ, కొట్టి భాస్కరరావు, మండెల పెద్ద, మండెల రజని పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో ఎస్‌వికెపిలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - పెనుగొండ

ఎస్‌వికెపి అండ్ డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆటానమస్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో తెలుగు భాషా సాహిత్యాల్లో రెండు రోజులపాటు అంతర్జాతీయ తెలుగు సదస్సు జరగనుందని, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ వైవి.అప్పారావు ప్రకటనలో తెలిపారు. వీటికి రెండో అంతర్జాతీయ సమావేశాలు (తెలుగు- 2024)గా పేరు పెట్టామని తెలిపారు. ఈ సంవత్సరం సదస్సును తమ కళాశాల ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆటానమస్‌లో నిర్వహిస్తున్నట్టు ఆయన తెలియజేశారు. ఈ సదస్సులో ఫ్రాన్స్, అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. తెలుగు భాష సాహిత్యాలపై నాణ్యమైన పరిశోధన పత్రాలు వస్తున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో మహర్షి సత్యవతి విజ్ఞాన పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య రంకిరెడ్డి రామమోహన్‌రావు, కళాశాల తెలుగు అధ్యాపకులు కె.సురేష్‌బాబు, కెవి సుబ్బారావు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షులుగా బాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులుగా గాదిరాజు కృష్ణంరాజు (బాబు) ఎన్నికయ్యారు. పాలకోడేరు సాయిబాబా గుడి దగ్గర వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ గవర్నర్ వై.సత్య నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలకోడేరు వాకర్స్ క్లబ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రమాణస్వీకారం డిస్ట్రిక్ గవర్నర్ సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ విధివిధానాలు, సేవా కార్యక్రమాలను వివరించి, నూతన కార్యవర్గాన్ని ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకోడేరు వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులుగా గాదిరాజు కృష్ణంరాజు (బాబు), కార్యదర్శిగా ఐ.కోటేశ్వరరాజు, సహాయ కార్యదర్శిగా ప్రసాద్‌రాజు, ఉపాధ్యక్షులుగా కె.కృష్ణంరాజు, డైరెక్టర్లుగా ఆళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణ, జాలీ వాకర్ ఎ.రమణను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కౌన్సిలర్ కె.నరసింహమూర్తి, జిల్లా సెక్రటరీ వి.నాగేంద్రప్రసాద్, గుంటూరి రామరాజు, జి.లక్ష్మణ రాజు పాల్గొన్నారు.



కృష్ణంరాజును అభినందిస్తున్న సభ్యులు

24న ఇరగవరం మండల పరిషత్ సమావేశం


ప్రజాశక్తి - ఇరగవరం

ఈనెల 24న మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి కె.పద్మజ్యోతి తెలిపారు. 24వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు, మండల ప్రజా పరిషత్తు అధ్యక్షురాలు కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ, మండలస్థాయి అధికారులందరూ సమావేశానికి తప్పక హాజరు కావాలని పద్మజ్యోతి తెలిపారు.

వాసవీ సుబ్బారావుకు సతీవియోగం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవీ ఇంజినీరింగ్ కళాశాల పాలక వర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు సతీమణి చలంచర్ల సాయి నవభారతి (70) గురువారం ఉదయం మృతి చెందారు. ఆమె కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. సహచర పాలక వర్గ సభ్యులు, ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపల్స్ రత్నాకర్ రావు, భాస్కరరాజు, డీన్ రాంబాబు వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది భారతి భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. సుబ్బారావుకు సానుభూతి తెలిపారు.



వాలంటీర్లకు సన్మానం చేస్తున్న పివిఎల్

వాలంటీర్ల సేవలు ఎనలేనివి

డిసిసిబి చైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

వాలంటీర్ల సేవలు ఎనలేనివని డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం మహదేవపట్నంలో మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పివిఎల్ నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. కరోనా సమయంలో వాలంటీర్లు చేసిన సేవలను దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ప్రశంసించక తప్పదన్నారు. వాలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం మహదేవపట్నం, చిలుకూరు, వాంద్రం, ఎన్ఆర్‌పి.అగ్రహారం, పెదపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడ, అర్తమూరు తదితర గ్రామాల వాలంటీర్లకు సేవా మిత్ర సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలిసిపూడి ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, పెద్దపుల్లేరు ఎంపిటిసి రాయి రావులమ్మ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఈది ఎడ్వర్డ్ జాన్సన్, నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

అదనపు డిఎంహెచ్ఒ భానునాయక్

ప్రజాశక్తి - వీరవాసరం

ఏప్రిల్ 3న నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు డిఎంఅండ్ హెచ్ఒ భానునాయక్ తెలిపారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. పల్స్ పోలియో నిర్వహించడానికి అవసరమైన సదుపాయాల కల్పనలో భాగంగా లేబర్ రూం, ఫార్మసీ, లేబరేటరీలను ఆయన పరిశీలించారు. రోగులకు అవసరమైన సేవలను సిబ్బంది సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన వివరాలను వైద్యాధికారి మోసినా, డాక్టర్ హర్షిత, సిహెచ్ఒ దేవదాసును అడిగి తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల కాలంలో అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన గొంది గ్రామానికి చెందిన కందికట్ల పేరమ్మ, పెదపాటి జయకృష్ణ, వంగ ధర్మకాంత, అంగాడి మంగమ్మ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. చనిపోవడానికి గల కారణాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట యర్రంశెట్టి శ్రీనివాసరావు, కవురు ధర్మారావు, పెదపాటి శ్రీను, ఆంగాడి ధర్మారావు, మోకా కృష్ణ, అంగాడి నాగేశ్వరరావు, పెదపాటి రమేష్, వర్ధనపు శేఖర్, పెదపాటి చిన రమేష్ ఉన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

నరసాపురం: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కొవ్వలి ఫౌండేషన్ కోశాధికారి కె.జయలక్ష్మి తెలిపారు. వైఎన్ కళాశాల పిజి సెమినార్ హాల్ వద్ద కొవ్వలి ఫౌండేషన్, ఇన్నోవేషన్, సంస్థాగత అభివృద్ధి కేంద్రం సంయుక్తంగా ఇగ్నైటింగ్ స్టార్ట్ అప్స్, కెరీర్ అడ్వాన్స్మెంట్ అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వలి ఫౌండేషన్ కోశాధికారి కె.జయలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 'ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని స్టార్ట్ అప్స్‌ను నెలకొల్పడం ద్వారా ఉద్యోగాలను కల్పించ వచ్చన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగం పొందాలంటే కొత్త కోర్సుల్లో చేరడం ద్వారా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలిపారు. కళాశాల బిజినెస్ ఐడియా కాంపిటీషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు మాట్లాడారు. కళాశాల డీన్ గంధం రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, ఎంబిఎ డిపార్టుమెంటు హెడ్ ఆర్.పార్థసారథి పాల్గొన్నారు.

విద్యార్థుల పరిశ్రమల సందర్శన

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం బిఎ విద్యార్థులు జిల్లాలోని ఖండవల్లిలో రవళి స్పిన్నింగ్ మిల్స్, జయలక్ష్మి ఫెర్టిలైజర్స్ ఇండస్ట్రీస్‌ను గురువారం సందర్శించారు. నూతన విద్యా విధానంలో భాగంగా పరిశ్రమల సందర్శన ద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లో వాతావరణం, కాటన్ ఏవిధంగా తయారవుతుంది, వ్యవసాయానికి ఉపయోగపడు ఫెర్టిలైజర్స్ ఏ విధంగా తయారు చేస్తున్నారు, ప్రొడక్షన్ యూనిట్ తదితర అంశాలను విద్యార్థులు పరిశ్రమల్లో వ్యవస్థాపకుల ద్వారా తెలుసుకుని ప్రాజెక్టుపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి,వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నూతన విద్యా విధానం ద్వారా విద్యార్థుల అవగాహన, ఉద్యోగ కల్పన, పరిశ్రమల విధానంపై పట్టు సాధిస్తారని ఇలాంటి పరిశ్రమల సందర్శన ద్వారా విద్యార్థులు వారి భవిష్యత్తు ఉపయోగపడే అనేక విషయాలను అవగాహన చేసుకోవడం ద్వారా ఉద్యోగాలను సంపాదించుకుంటారని తెలిపారు. ఇండస్ట్రియల్ టూర్లో కామర్స్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు ఉషారాణి, సత్యవేణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఇఇ బళ్ల.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు, కాళీపట్నం, పేరుపాలెం గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నరసాపురం : ఈ నెల 23వ తేదీ 33/11 సబ్‌స్టేషన్ల (సీతారామపురం, తూర్పుతాళ్లు) మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. సీతారాంపురం, రాజుగారితోట, ఎర్రంశెట్టివారిపాలెం, మండవారిపేట, మంగలగుంటపాలెం, కొప్పర్రు, రుస్తుంబాద, లింగబోయినచెర్ల, పసలదీవి, తూర్పుతాళ్లు, పెదమైనవానిలంక, వేములదీవి, బియ్యపుతిప్ప, మర్రితిప్ప, దర్భరేవు గ్రామాలకు ఉదయం 8.00 గంటల నుండి 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణ పరిధిలోని 33/11 కెవి వాటర్ వర్క్స్, పుష్కర ఘాట్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని స్టీమర్ రోడ్డు ఏరియా, కోవెల వీధి, టవర్ స్ట్రీట్, ఆంధ్ర బ్యాంక్ స్ట్రీట్, టిటిడి కల్యాణ మండపం, శ్రీహరి పేట, పీచు పాలెం, పంజా సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఎంఆర్‌పిఎస్ సమావేశం

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 23వ తేదీన తాడేపల్లిగూడెంలో జరగనున్న ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎంఎస్‌పి జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు కనపాల పెద్దిరాజు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ సుప్రీంకోర్టులో జరిగిన న్యాయవాదుల వాదోపవాదాలు, త్వరలో రాబోయే సుప్రీంకోర్టు జడ్జీల తీర్పు, ఉద్యమ భవిష్యత్తు కార్యాచరణ తదితర కీలక అంశాలను దృష్టిలో ఉంచుకొని మందకృష్ణ మాదిగ దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ సమావేశాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు భీమవరం సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరవాసరం పంచాయతీ పరిధిలోని తలతాడితిప్పలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు బిసి-బికి రిజర్వుడు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవుడూరు పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు జనరల్ కేటగిరి వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హతలను బట్టి దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మొగల్తూరు: ఐసిడిఎస్ ప్రాజెక్టు మొగల్తూరు పరిధిలోని మూడు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు గురువారం సిడిపిఒ ఊర్మిళ ఒక ప్రకటనలో తెలిపారు. కాళీపట్నం పడమరలోని బిసి ఎ, జగన్నాధపురం దారితిప్పలోని జనరల్, లక్ష్మేశ్వరుని చాగంటి వారి మేరకులో బిసి బి సహాయకుల ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు. పదో తరగతి ఆపై, ఈ సంవత్సరం జూలై నాటికి 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. మార్చి ఒకటో తేదీ ఐదు గంటల్లోపు మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో విద్యా అర్హత, ఆధార్ కార్డు రేషన్ కార్డు తదితర ధ్రువీకరణ పత్రాలతో నేరుగా సమర్పించాలని కోరారు.

జర్నలిస్టులపై దాడికి ఖండన

ప్రజాశక్తి - నరసాపురం

రాప్తాడులో సిఎం జగన్ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తూ నరసాపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒ రామకృష్ణకు, డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి రవి మనోహరాచారికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు ఎం.మురళీధర్, ఎ.చిన్నారావు, టి.ఇజ్రాయేల్, సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



డిఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

తప్పులు ఎత్తిచూపితే మీడియాపై దాడులు చేస్తారా అని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాత్రికేయ మిత్రులపై, మీడియా కార్యాలయాలపై వైసిపి శ్రేణులు చేస్తున్న దాడిని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ మీడియాపై వైసిపి మూకలు చేస్తున్న దాడులు హేయమైనవని విమర్శించారు. ప్రభుత్వం మీడియా గొంతు నొక్కేందుకు ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. మీడియాపై వైసిపి ప్రభుత్వం చేస్తున్న దాడిని ఖండిస్తూ ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెంపాటి సత్యనారాయణ రాజు, కొండేటి శ్రీను, చాగంటి సురేష్, చాగంటి నరేంద్ర, కాజ హేమ, శేఖర్ బాబు, నాగరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : జిల్లాలో, రాష్ట్రంలో జర్నలిస్ట్‌లపై జరుగుతున్న దాడులను ఎపియుడబ్ల్యూజె జిల్లా సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకట రమణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ తొలి సమావేశం లయన్స్ క్లబ్‌లో గురువారం జరిగింది. ఎన్నికల సమయంలో జర్నలిస్ట్‌లపై జరిగే దాడులపై ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సాయిబాబా, ప్రధాన కార్యదర్శి గజపతి ప్రసాద్, కోశాధికారి ముత్యాలు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదవి ఆశించి జనసేనలో చేరలేదు

ఆప్కాబ్ మాజీ వైస్ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం)

ప్రజాశక్తి - ఆకివీడు

తాను ఏ రకమైన పదవి ఆశించీ జనసేనలో చేరలేదని, అసెంబ్లీకి పోటీ చేసేందుకు టిక్కెట్ కూడా అడగలేదని డిసిసిబి మాజీ చైర్మన్, ఆప్కాబ్ మాజీ వైస్ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) అన్నారు. భీమవరంలో పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం జనసేనలో చేరిన రత్నం దంపతులు రాత్రి కుప్పనపూడి ఆయన నివాసంలో అభిమానులు, కార్యకర్తలు నాయకులతో ఆత్మీయ సమ్మేళన ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రత్నం భార్య ఆకివీడు సహకార బ్యాంకు మాజీ చైర్మన్ ముత్యాల వెంకట సత్య ఉమాదేవి, జుట్టిగ నాగరాజు, తోట వాసు పాల్గొన్నారు.

టి.నర్సాపురానికి రైల్వే కూత..!



మండలం మీదుగా రైల్వేలైన్‌కు ఆ శాఖ గ్రీన్‌సిగ్నల్

మెట్ట ప్రాంతంలో జోరుగా చర్చ

ఇప్పటికే నిర్మాణంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే

టి.నరసాపురం కేంద్రంగా నేవీ లోడింగ్ పాయింట్

అన్ని రకాల అభివృద్ధికి అవకాశం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో భవిష్యత్తులో రైలు కూత విన్పించనుంది. అటు హైదరాబాద్, ఇటు వైజాగ్ తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యం విస్తరించనుంది. మండల ప్రజలు ఎవరూ ఊహించని విధంగా జిల్లాలో కొవ్వూరు నుండి జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట మీదుగా భద్రాచలం వెళ్లాల్సిన రైల్వేలైన్ కొవ్వూరు నుండి జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంబడి మండలానికి రాబోతుంది. దక్షిణమధ్య రైల్వే అధికారులు మండలం మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. దీనిపై జిల్లాలో, ప్రధానంగా మెట్టప్రాంతంలో ఇప్పటికే పెద్దఎత్తున చర్చ సాగుతోంది. జిల్లాలో మారుమూల ప్రాంతంగా ఉన్న టి.నరసాపురం మండలానికి రైల్వేలైన్ రావడం హర్షణీయమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో మరో సౌకర్యవంతమైన ప్రయాణ, రవాణా సౌకర్యం రైల్వేలైన్‌తో ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు.

కొవ్వూరు-భద్రాచలం రోడ్ రైల్వే లైన్ నిర్మాణానికి దక్షిణమధ్య రైల్వే పచ్చ జెండా ఊపిందని తెలుస్తోంది. ఏప్రిల్ 1న సత్తుపల్లిలో ఈ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే అప్పటికి ఎన్నికల కోడ్ రానుండటంతో ఈ ప్రచారంపైనా పలు అనుమానాలు నెలకొన్నాయి. అయితే దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆరుణ్ కుమార్ జైన్ నేతృత్వంలో ఈ లైన్ నిర్మాణ పనులకు సాగుతున్నాయని, 2030 మార్చి నాటికి 151 కిలోమీటర్ల రైల్వేట్రాక్ నిర్మాణమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు. దీనికిగాను రూ.2154 కోట్లు ఖర్చవుతుందని అంచనా వ్యయం రూపొందించినట్లు సమాచారం. దీనికి రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా వచ్చాయని ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే హైదరాబాద్-రాజమండ్రి మధ్య రాకపోకలు సాగించేవారికి మరింత సులభ రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే సుమారు 75 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని అధికారుల అంచనా. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుతోపాటు పలువురు ఎంపీలు పలుమార్లు రైల్వే ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని చెబుతున్నారు.

మండల ప్రజలు హర్షం

మండలం మీదుగా రైల్వే లైన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారనే వార్త చర్చనీయాంశమైంది. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం క్రమంలో రైల్వేలైన్ కూడా ఏర్పాటైతే మండలం నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1960లో జీలుగుమిల్లి మండలం మీదుగా లైన్ ఏర్పాటుకు సర్వే

భద్రాచలం రోడ్-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటుకు 1960లోనే తొలి సర్వే జరిగింది. అప్పటి అవసరాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనేక ప్రతిపాదనలు చేశారు. కొత్తగూడెం (భద్రాచలం రోడ్) స్టేషన్ నుంచి సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలతోపాటు, కొయ్యలగూడెం మండలం రాజవరం, పొంగుటూరు మీదుగా కొవ్వూరు వరకూ ఈ లైన్ నిర్మించాలని నాటి సర్వే సాగింది. తర్వాత పలు దఫాలు సర్వేలు సాగినా అవేమీ కార్యరూపం దాల్చలేదు. అయితే 2004 తరువాత సత్తుపల్లి ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభం కావడంతో తెలంగాణ ప్రభుత్వం కొత్తగూడెం-సత్తుపల్లి మధ్య బొగ్గు తరలించేందుకు రైల్వేలైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కాస్ట్ షేరింగ్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం రూ.706 కోట్ల ఖర్చు భరించగా, రైల్వే శాఖ రూ.85 కోట్లు వెచ్చించి ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో సత్తుపల్లికి రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. ఇక కొవ్వూరు- సత్తుపల్లికి మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి డిమాండ్ ఉండటంతో ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే వెంబడి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు చేపట్టినట్లు తెలుస్తోంది.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో అప్పన్నపేటకు చెందిన 20 మంది జనసేన, టిడిపి నుంచి గురువారం వైసిపిలో చేరారు. ఎంఎల్ఎ వాసుబాబు తన క్యాంపు కార్యాలయంలో వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి జనసేన, టిడిపి నుంచి యువకులు పెద్ద ఎత్తున వైసిపిలో చేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అప్పన్నపేట సర్పంచి నూకారపు సుధాకరరావు, మాజీ సర్పంచి నక్కా సూరి బంగారయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.